7

# అద్భుతములు & పరిశుద్ధాత్మ

*"ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యముచేసినయెడల ఏలాగు తప్పించు కొందుము? అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై, దేవుడు తన చిత్తాను సారముగా సూచకక్రియలచేతను, మహత్కార్యములచేతను, నానావిధములైన అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుటచేతను, వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినినవారిచేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ. 2:3, 4).*

పరిశుద్ధాత్మ పనిలో అద్భుతములు ఒక ప్రాముఖ్యమైన భాగమైయున్నాయి. అద్భుతాలు చేయడానికి తండ్రి పరిశుద్ధాత్మను ఏజెంట్‌గా వాడుకున్నట్టు లేఖనాలు అంటున్నాయి (హెబ్రీ. 2:3, 4). ఆత్మ యొక్క శక్తులద్వారా, మాట్లడుతున్న మనుష్యులు తన మనుష్యులని దేవుడు సాక్ష్యమిచ్చాడు (మార్కు 16:20). ఆత్మద్వారా తన వాక్యాన్ని ఆయన తెలియజేసి, స్థిరపరచి భద్రపరచాడు.

## అద్భుతములు తిరిగి జరిగింపబడేవి కావు

అద్భుత శక్తులద్వారా దేవుడు దేనిని రుజువుచేశాడో, అద్భుతాలు జరిగించి తిరిగి ఆయన వాటిని రుజువుచేయవలసిన అవసరము లేదు. సృష్టిద్వారా దేవుడు తన ఉనికిని తన స్వభావాన్ని శాశ్వతంగా రుజువు పరిచాడు (రోమా 1:20). ఆకాశమహావిశాలమందు దేవుని మహిమ ఆయన శక్తి ప్రదర్శించబడింది (కీర్తన 19:1). మరియు మన గ్రహములో ఉన్న అసంఖ్యాకములగు ప్రాణుల రూపాలయందు ఆయన జ్ఞాన బాహుళ్యము ప్రచురమై యుంది. సృష్టి ఆరంభమునుండి ఆయన నిత్య శక్తి దేవత్వము బయలుపరచబడుతుంది.

మానవ ఆరంభ చరిత్రలో, బహు దేవతా మతాలు అనేక దేవతలను కల్పించి, దేవుడు ఒక్కడే అని రుజువుచేయవలసిన అవసరతను ఆ ఒక్కడైయున్న దేవుడు ఎవరనే అవసరతను తెచ్చాయి. అనేక విగ్రహములతో నింపబడిన ఐగుప్తు దేశములో దేవుడు తన్ను తాను రుజువు చేసికొన్నాడు. అనేక దేవతలను కొలిచే వాతావరణంతో చుట్టబడిన ఫరో, "–నేను అతని మాట విని ఇశ్రాయేలీయులను పోనిచ్చుటకు యెహోవా ఎవడు?" అని ప్రశ్నించాడు (నిర్గమ. 5:2ఎ) దానికి బదులుగా, తన మహిమను ఫరో దేవతలపై తన ప్రభావ ఘనతను అద్భుతాలను జరిగించి దేవుడు కనుపరచాడు. ఆయన మాత్రమే దేవుడని తన్నుతాను రుజువుపరచుకున్నాడు. "... ఐగుప్తు దేవతల కందరికిని తీర్పు తీర్చెదను" అని ఆయన సెలవిచ్చాడు (నిర్గమ. 12:12). ఐగుప్తు బానిసత్వంనుండి ఇశ్రాయేలీయులను విడిపించుటలో దేవుడు చేసిన అద్భుతాలకు సంబంధించి, మోషే

మామయైన యిత్రో సరియైన తీర్మానానికి వచ్చి, అతడిలా అన్నాడు: “ఐగుప్తీయులు గర్వించి ఇశ్రాయేలీయులమీద చేసిన దౌర్జన్యమునుబట్టి ఆయన చేసిన దాని చూచి, యెహోవా సమస్త దేవతలకంటె గొప్పవాడని యిప్పుడు నాకు తెలిసినది” (నిర్గమ. 18:11).

తానే దేవుడైయున్నట్టు దేవుడు ప్రతి తరమువారికి రుజువుపరచుకోనవసరం లేదు. “నేనే యెహోవానని మీరు తెలిసికొనునట్లును, నేను చేయు సూచకక్రియలను ఐగుప్తీయుల యెదుట కనుపరచుటకు, నేను వారియెడల జరిగించిన వాటిని వారి యెదుట కలుగజేసిన సూచకక్రియలను నీవు నీ కుమారునికి నీ కుమారుని కుమారునికి ప్రచురము చేయా” లని ఆయన మోషేకు తెలిపాడు (నిర్గమ. 10:2). ఐగుప్తీయులపై దేవుడు కనుపరచిన మహాత్కార్యాలను ఇశ్రాయేలీయుల కుమారులకు, మనుమలకు తిరిగి ఆయన కనుపరచాడు. ఆయన అద్వితీయ సత్య దేవుడైయున్నట్టు ఆయన ఒక తరములో చేసిన కార్యాలను రాబోవు తరములకు వారు తెలియజేయవలసినవారైయున్నారు.

అనేక సంవత్సరాల తరువాత, “యెహోవా మాకు తోడైయుండిన యెడల ఇదంతయు మాకేల సంభవించెను? యెహోవా ఐగుప్తులోనుండి మమ్మును రప్పించెనని చెప్పుచు, మా పితరులు మాకు వివరించిన ఆయన అద్భుతకార్యములన్నియు ఏమాయెను?” అని గిద్యోను అడిగాడు (న్యాయాధి. 6:13). (1) ఐగుప్తులోనుండి ఇశ్రాయేలీయులను విడిపించినప్పుడు జరిగిన అద్భుతాలు నేడు జరుగుటలేదని (2) ఆ అద్భుతాలను గురించి తరువాత తరములవారు చెప్పబడ్డారని – దీన్నిబట్టి తెలుస్తుంది.

ఆలాగే, ప్రభువు చేయగా అద్భుతాలను చూచినవారు తరువాత తరములవారికొరకు రికార్డు చేసియుంచారు (యోహాను 20:30, 31). ఆయన జీవితం, అద్భుతాలు, మరణము, సమాధి, పునరుత్థానాలు రాయబడిన వాక్యం ద్వారా మనం నేర్చుకుంటాం. ఆ సంభవాలు తిరిగి చేయబడవు.

## అద్భుతాలకు ప్రత్యేకమైన ఉద్దేశముంది

ప్రజలపై కనికరపడి ప్రభువు కొన్నిసార్లు అద్భుతాలు జరిగించారు (మత్తయి 9:36; 14:14; 15:32; 20:34). ఏదియెలాగున్నా, సృష్టి ఆరంభమునుండి చేయబడిన ప్రతి అద్భుతానికి ఏదోయొక్క ప్రధాన ఉద్దేశముంటుంది.

1. సృష్టిని చేయడం వెనుకనున్న ప్రధాన ఉద్దేశం దేవుని ఉనికిని రుజువు చేయడమై యున్నట్టుంది (రోమా 1:20).

2. అద్భుతాల ద్వారా, దేవుడే నిజమైన దేవుడని తన్నుతాను కనుపరచుకున్నాడు – ఐగుప్తు దేవతలకంటె గొప్పవాడనియు (నిర్గమ. 10:2; 18:11) కనానీయుల దేవతలను మించినవాడనియు ప్రదర్శించుకున్నాడు (1 రాజులు 18:36–39).

3. సూచక క్రియలు, అద్భుతములు, మహాత్కార్యముల ద్వారా యేసు తన కుమారుడని దేవుడు రుజువుపరిచాడు (యోహాను 20:30, 31; అపొ. 2:22).

4. “సూచక క్రియలును మహాత్కార్యములును, అద్భుతములును జరిగించుటచే” (అపొస్తలులు) తన పట్ల మాట్లాడేవారినిగా దేవుడు సూచించాడు (2 కొరింథీ. 12:12).

5. పరిశుద్ధాత్మ ద్వారా తన వాక్యాన్ని బయలుపరచడానికి కొందరిని ఏర్పరచుకొనడంలో దేవుడు తన శక్తిని ఉపయోగించుకున్నాడు (ఎఫెసీ. 3:3–5; 2 తిమోతి 3:16; 1 పేతురు 1:10–12; 2 పేతురు 1:20, 21).

6. దేవుని పక్షంగా మాట్లాడేవారికి అద్భుత రీతిగా వాక్యాన్ని యివ్వడం మాత్రమే గాక, అది సూచక క్రియలు అద్భుతములు, మహత్కార్యములను స్థిరపరచబడింది (మార్కు 16:20; అపొ. 14:3; హెబ్రీ. 2:2–4).

7. దేవుడు తన చిత్తాన్ని అద్భుతమైన గురుతుల ద్వారా స్థిరపరచాడు. ఉదాహరణకు, అన్యజనులకు ఆయన రక్షణ మార్గము తెరుస్తున్నట్టు ఆయన ఒక సూచనను కనుపరచాడు (అపొ. 10:47; 11:17; 15:7–9). సమరయులలో మార్పుపొందినవారిని ఆయన అంగీకరించినట్టు గురుతుచూపబడింది (అపొ. 8:14–19). ఈ జనులను ఒకప్పుడు యూదులు అంగీకరించలేదు (యోహాను 4:9) – బాప్తిస్మమిచ్చు యోహాను బాప్తిస్మం పొందినవారు తిరిగి మార్పుపొందినప్పుడు (అపొ. 19:1–6).

## తప్పుడు గురుతులు చూపించబడ్డాయి

అబద్ధ బోధకులు ఒప్పించే సూచక క్రియలను మహాత్కారములను చేయవచ్చు. ఈ సత్యాన్ని మోషే (ద్వితీయో. 13:1–3), యేసు (మత్తయి 24:24), పౌలు (2 కొరింథీ. 11:13–15; 2 థెస్స. 2:8–10), మరియు యోహాను (ప్రకటన 13:13, 14; 16:14) అనేవారందరు బోధించారు.

నిజమైన దేవుని ఉపదేశకులో, కారో నిర్ణయించడానికిగాను వారు బోధించినదేదో మనము పరీక్షించవలసియుంది. ఒక ప్రవక్త (మత్తయి 7:15–20), నిజమైన ప్రవక్త, అబద్ధ ప్రవక్త అనేదానికి ప్రవక్త యొక్క ఫలము, అతని బోధ అధారమైయుంటుంది. దేవుడు తన ప్రజలకు యిలా బోధించాడు:

> ప్రవక్తయేగాని కలలు కనువాడేగాని నీ మధ్యలేచి నీ యెదుట సూచక క్రియనైనను మహత్కార్యమునైనను చేసి నీవు ఎరుగని యితర దేవతలను అనుసరించి పూజింతము రమ్మని చెప్పినయెడల అతడు నీతో చెప్పిన సూచకక్రియగాని మహత్కార్యముగాని సంభవించినను ఆ ప్రవక్తమాటలను కలలు కనువాని మాటలను వినకూడదు. ఏలయనగా మీరు మీ దేవుడైన యెహోవాను మీ పూర్ణ హృదయముతోను మీ పూర్ణాత్మతోను ప్రేమించుచున్నారో లేదో తెలిసికొనుటకు మీ దేవుడైన యెహోవా మిమ్మును పరీక్షించుచున్నాడు. మీరు మీ దేవుడైన యెహోవాకు లోబడి ఆయనకే భయపడి ఆయన ఆజ్ఞల ననుసరించి ఆయన మాట విని ఆయనను సేవించి ఆయనను హత్తుకొని యుండవలెను. నీవు నడవవలెనని నీ దేవుడైన యెహోవా నీకాజ్ఞాపించిన మార్గములోనుండి నిన్ను తొలగించునట్లు ... మీ దేవుడైన యెహోవా మీద తిరుగుబాటు చేయుటకు మిమ్మును ప్రేరేపించెను గనుక ఆ ప్రవక్తకేమి. ... మరణశిక్ష విధింపవలెను ... (ద్వితీయో. 13:1–5).

తాను చెప్పుదాని బట్టి ఒక ఉపదేశకుని పరీక్షించాలని దేవుడు తన ప్రజలను కోరుతున్నాడు (1 యోహాను 4:1, 6). బైబిల్లో బయలుపరచినట్టు దైవసత్యాన్ని

ఉపదేశించని ఎవడైనా అబద్ధ బోధకునిగా భావించవలసియుంటుంది – అతడు సూచక క్రియలు మహాత్కార్యములు చేసేవాడైనా సరే.

మోషే చేసిన సూచక క్రియలకు "తాము మంత్రములచేత" నకిలీ చేసిన ఫరోయొక్క శకునగాండ్రు ఫరోను తప్పు త్రోవకు మళ్లించారు – వారు తమ కర్రలను పాములుగాను (నిర్గమ. 7:11), నీటిని రక్తముగాను మార్చారు (నిర్గమ. 7:20, 22), మరియు కప్పలను పుట్టించారు (నిర్గమ. 8:6, 7). ఈ కార్యాలు, ఎంత అద్భుతంగా కన్పించినా, ఫరోయొక్క శకునగాండ్రు దేవునియొద్దనుండి వచ్చినవారిని రుజువు చేయబడలేదు. అదేవిధంగా, నవయుగపు అద్భుతాలు చేస్తామనేవారు, అసాధారణమైన కార్యాలు చేసినట్టు కన్పించినా, దేవుడు వారిద్వారా పనిచేస్తున్నాడనడానికి అది రుజువు కానేరదు.

అట్టి మోసయుక్తమైన పనులమూలము మనకు తెలియకపోవచ్చు. అది సాతాను కనుపరచు బలము ననుసరించిన అద్భుత శక్తులా (2 థెస్స. 2:9), సాతానుచే ఉద్దేశం కలిగించిన పనులా (2 కొరింథీ. 11:13–15), దేవునిచే అనుమతింపబడిన మోసముచేయు శక్తియా (2 థెస్స. 2:11, 12) లేక దయ్యములచే జరిగింపబడిన కార్యములా (ప్రకటన 16:14)? అట్టి శక్తిని సాతాను ప్రయోగింప నేడు దేవుడు అనుమతియిస్తాడా? యోబును బాధించడానికి దేవుడు సాతానుకు అనుమతి యిచ్చినట్టు మనకు తెలుసు (యోబు 1:12; 2:6); సంకెళ్లను తెంచుకొనేలా అపవిత్రాత్మ ఒక యువకునికి బలమిచ్చినట్టు చెప్పబడింది (మార్కు 5:2–4). అయితే దేవుని యొద్దనుండి వచ్చిన అద్భుతాలకు సమానమైన కార్యాలను అపవాది ఎన్నడును చేయలేదు. ప్రభువైన యేసు పరిచర్య కాలములో అపవాదియు దయ్యములును కనుపరచిన శక్తులు నేడున్నట్టు లేదు. బైబిలును రాసినవారు దేవునినుండి సందేశం పొందినవారని మనం ఎరుగగలం. వారు రాసినదాన్ని ఆధారంగా చేసికొని ఎవరు సత్య ఉపదేశకులో ఎవరు అబద్ధ బోధకులో మనం తీర్మానించగలం (1 యోహాను 4:6).

## అద్భుతాలకు దైవికమైన మూలముంది

కేవలం ఒకని విశ్వాసపు బలముమీదనే ఆధారపడి కాకుండ దేవుని శక్తి ద్వారా అద్భుతాలు జరిగాయి. ప్రభువైన యేసు తన్ను తానే రిక్తునిగా చేసికొన్నవారై (ఫిలిప్పీ. 2:6, 7), తాను అభిషేకింపబడిన పరిశుద్ధాత్మ శక్తిచేత అద్భుతాలు జరిగించారు (మత్తయి 12:28; లూకా 4:18; అపొ. 10:38). ఆయన తన డెబ్బది మంది శిష్యులకు కొంత అద్భుతములు చేయు శక్తిని ప్రసాదించారు (లూకా 10:9, 17), అపొస్తలులతో ఉన్న పరిశుద్ధాత్మ ద్వార (యోహాను 14:17), వ్యక్తిగతమైన తన పరిచర్య కాలంలో, ఆ శక్తిని అపొస్తలులకు కూడ యిచ్చి పంపారు (మత్తయి 10:1). తరువాత, వారు పరిశుద్ధాత్మ పొంది శక్తితో నింపబడినప్పుడు (అపొ. 1:2–5; 2:4) వారు మరింత శక్తితో పని చేశారు. పెంతెకొస్తు దినాన పరిశుద్ధాత్మ వచ్చిన తరువాతనుండి అపొస్తలులు అద్భుతాలు చేసినట్టు చెప్పబడింది (అపొ. 2:43; 4:33; 5:12). అపొస్తలులు తమ మీద చేతులుంచువరకు యితరులు అద్భుతాలు చేయలేకుండిరి, యిది స్తెఫను, ఫిలిప్పుల

విషయంలో సత్యమైయుంది (అపొ. 6:5, 6, 8; 8:6).

వారు శిష్యులుగా ఉండిన తొలి దినాల్లో – అపవిత్రాత్మలను (మత్తయి 10:1, 8; మార్కు 3:14, 15) దయ్యములను (మార్కు 6:13) వెళ్లగొట్టగల శక్తిపొందిన వారైయున్నను అపొస్తలులు ఒక దయ్యము పట్టినవానిని బాగుచేయలేకపోయారు. ఇది దయ్యాన్ని వెళ్లగొట్టే శక్తిలేనందున కాదు, అలా చేసే విశ్వాస లోపంవలన (మత్తయి 17:20). ఆ విశ్వాసలేమి దయ్యము పట్టినవానిదో వాని తండ్రిదో కాదు, అది అపొస్తలులదే.

అద్భుతం చేయడానికి మొదటిగా శక్తి ప్రసాదింపబడాలి. ఇవ్వబడిన శక్తిని ప్రయోగించుకునే విశ్వాసమూ కావాలి. నీళ్లమీద నడిచే శక్తిని ప్రభువు పేతురుకు యిచ్చారు – అయితే పేతురు లోపించాడు – అతడు శక్తి యివ్వబడినందుకు కాదు, కాని అతని విశ్వాసం అతని విఫలునిగా చేసింది (మత్తయి 14:28–31).

పరిశుద్ధాత్మ ద్వారా దేవునిచే అద్భుతాలు యివ్వబడ్డాయి (1 కొరింథీ. 12:4–6) అది మనుష్యేచ్ఛను బట్టిగాని, వాని విశ్వాసాన్నిబట్టిగాని కాక, ఆత్మక్రియ ద్వారా యివ్వబడ్డాయి. "అయినను వీటినన్నిటిని ఆ **ఆత్మ** యొక్కడే తన చిత్తము చొప్పున ప్రతివానికి ప్రత్యేకముగా పంచియిచ్చుచు కార్యసిద్ధి కలుగజేయుచున్నాడు" అని మనం చెప్పబడ్డాం (1 కొరింథీ. 12:11; హెబ్రీ. 2:4 కూడ చూడు). వరమును పొందిన వ్యక్తి యొక్క అపేక్షను బట్టికాక, క్రైస్తవునికి యివ్వబడిన అద్భుత వరము పరిశుద్ధాత్మ యిష్టం మీద ఆధారపడియుంది.

ఆత్మను యితరులకు యిచ్చి పరిశుద్ధాత్మ వరములు తమ చేతులుంచుటవలన ప్రసాదించగల అధికారము అపొస్తలులకు యివ్వబడింది (అపొ. 19:6; 2 తిమోతి 1:6). ఆత్మను యివ్వగల సామర్థ్యము అపొస్తలుని చిహ్నమైయుంది (2 కొరింథీ. 12:12). అపొస్తలుల ద్వారా శక్తిపొందినవారు తిరిగి తమ చేతులు యితరుల మీద ఉంచి అద్భుత వరములు ప్రసాదింపగలవారైనట్టు మనకు ఏలాటి రుజువూ లేదు.

అద్భుతములు చేయు శక్తిగల ఫిలిప్పు అక్కడ ఉన్నప్పటికిని (అపొ. 8:6), పరిశుద్ధాత్మను యితరులకు యివ్వడానికి అపొస్తలులైన పేతురు యోహానులు సమరయలో అవసరమయ్యారు (అపొ. 8:14–19), ఇతరులకు అద్భుతాలు జరిగించే శక్తిని ప్రసాదించే సామర్థ్యము అపొస్తలులకివ్వబడింది.

సమరయలో పేతురు, యోహానుల పనిని గూర్చి J. W. McGarvey యిలా రాశాడు,

> శిష్యుల విశ్వాసాన్ని స్థిరపరచడం లేదా తన ప్రయాసలో ఫిలిప్పుకు సహాయ పడడం వంటివి ఇద్దరు అపొస్తలుల పనిని ప్రేరేపించిన యితర ఉద్దేశాలు ఏమైయున్నా, ముఖ్యమైన ఉద్దేశమేమంటే పరిశుద్ధాత్మను వారిమీదికి రప్పించుటయైయుంది. వారు దేనికొరకైతే వెళ్లారో, అక్కడ చేరుకున్న మీదట దానినే వారు చేశారు: వారు జరిగించిన ప్రధానమైన సంగతి పరిశుద్ధాత్మను ప్రసాదించడం; గనుక వారు అక్కడికి వెళ్లడంలో అదే ముఖ్యమైన పనియైయుంది. ఫిలిప్పే ఆ పని చేయగలిగియున్నట్టయితే, ముఖ్యమైన పనికి సంబంధించి వారు అక్కడికి వెళ్లడం నిరుపయోగమై యుండేదే. అందువలన అద్భుత వరములు అపొస్తలుల చేతులద్వారానే తప్ప మరి ఏ యితర మానవ హస్తముల ద్వారా యివ్వబడలేదు. మరియు అపొస్తలుల కార్యాల్లో దాఖలు చేయబడిన ఈలాటి మరియొక సంఘటన అంటే, ఎఫెసులో పన్నిద్దరికి జరిగిన దాన్ని ఆలోచిస్తుంటే ఈ తీర్మానం స్థిరపరచబడుతుంది (19:1–7), ఆ వరము అపొస్తలులు చేతులుంచుట

వలన ప్రసాదింపబడుతుంది.[1]

కొరింథులోని సంఘమునకు ఏ కృపావరము కొదువలేకయుంది (1 కొరింథీ, 1:7). ఈ వాస్తవం పౌలు యొక్క అపొస్తలత్వానికి ముద్రగా ఉపయోగించబడింది. "... మీ మట్టుకైనను అపొస్తలుడనై యున్నాను" అని పౌలు వారికి రాశాడు (1 కొరింథీ. 9:2). వారికున్న కృపావరములన్నీ కేవలం విశ్వాసం ద్వారానో లేక అపొస్తలుని చేతులుంచడంవలన కాక యితర మూలముగుండా కొరింథులోని సంఘము ఆ వరములు పొందగలిగినయెడల, తన అపొస్తలత్వానికి వారు ముద్రగా ఉన్నట్టు పౌలు అనేవాడు కాడు, కొరింథుకు మరి ఏ యితర అపొస్తలుడు పోకుండినట్టయితే, పౌలు తప్పక అపొస్తలుడైయుండాలి, ఎందుకంటె కొరింథీయులకు అద్భుత వరాలు యివ్వడానికి అతడు మాత్రమే అక్కడున్నాడు. ఇది సత్యమైయున్నందున, కొరింథు సంఘములోని కృపావరములు తన అపొస్తలత్వానికి రుజువుగా ఉన్నాయి.

అపొస్తలుని హాజరుతో నిమిత్తము లేకుండ అద్భుతశక్తులను దేవుడు నేరుగా యిస్తున్నట్టయితే, పేతురు యోహానులు సమరయకు వెళ్లనవసరం లేదు సరిగదా, ఆత్మసంబంధమైన కృపావరమేదైనను యిచ్చుటకు పౌలు రోమును సందర్శించనవసరము కూడ లేదు (రోమా 1:11). దేవుడు ఆ విధంగా పనిచేసినట్టయితే, అపొస్తలులు ఉనికి లేకుండగనే దేవుడు చేసియుండేవాడు. దానికి ఒకే మినహాయింపు కొర్నేలి యింటివారు.[2]

(అపొస్తలుల దినాలు) ఆ కాలంనుండి, సూచకక్రియలు. అద్భుతములు, మహత్కార్యాలు నిలిచిపోయాయి. అలాటి వరాలను ప్రసాదించడానికి అపొస్తలులెవరును లేరు. నేడు అద్భుతాలు చేస్తామని చెప్పేవారు నీళ్లమీద నడవగలగాలి, రేగుతున్న సముద్రాన్ని అణచగలగాలి! మృతులను లేపగలగాలి, జనసమూహాలను పోషించడానికి భోజనాన్ని విస్తరింప చేయగలగాలి. ఈ సామర్థ్యాన్ని వారు మాటిమాటికి ప్రదర్శించ గలగాలి. క్రొత్త నిబంధనలో వర్ణింపబడిన అద్భుతాలను వారు చేయలేరు.

## ప్రత్యేకించిన విశ్వాసులచే అద్భుతాలు చేయబడ్డాయి

మార్కు 16:17, 18ల్లో ప్రభువైన యేసు యిలా అన్నారు: "నమ్మినవారివలన ఈ సూచక క్రియలు కనబడును; ఏవనగా, నా నామమున దయ్యములను వెళ్లగొట్టుదురు; క్రొత్త భాషలు మాటలాడుదురు, పాములను ఎత్తి పట్టుకొందురు, మరణకరమైనదేది త్రాగినను అది వారికి హాని చేయదు, రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థతనొందుదురు." ఈ లేఖన భాగము ఈ క్రింది ప్రశ్నలకు జవాబు చెప్పదు: (1) విశ్వాసులందరు – దయ్యములను వెళ్లగొట్టి, క్రొత్త భాషలు మాట్లాడి, పాములను ఎత్తిపట్టుకొని, హానిపొందకుండ విషమును త్రాగి, రోగులను స్వస్థపరచుదురా? (2) ఈ వరములు కొద్ది మందికి మాత్రమే పరిమితియా? (3) ఈ కార్యాలను జరిగించేవారు దేని ఆధారముతో చేయగలుగుతారు? (4) ఈ సూచనలు ఎంత కాలం కొనసాగుతాయి? (5) ఈ గురుతుల ఉద్దేశమేమి?

విశ్వాసులందరు ఈ వరములు కలిగినవారు కారని పౌలు యొక్క ప్రతిపాదన

రుజువు చేస్తుంది (1 కొరింథీ. 12:7-11, 27-31). అతడు విదితమైన భావములు వచ్చు ప్రశ్నలను యిలా అడిగాడు: "అందరు అపొస్తలులా? అందరు ప్రవక్తలా?అందరు బోధకులా? అందరు అద్భుతములు చేయువారా? అందరు స్వస్థపరచు కృపావరములు గలవారా? అందరు భాషలతో మాట్లాడుచున్నారా? అందరు ఆ భాషల అర్థము చెప్పుచున్నారా?'' విశ్వాసులలో కొందరు మాత్రమే ఈ అద్భుత వరములు గలవారైయున్నారు. అందులో ప్రతివాడు తనకు అనే ప్రత్యేకమైన వరములు కలిగియున్నాడు.

వారు కేవలం విశ్వాసులైనందుననే ఈ అద్భుత వరములు కలిగియుండలేదు, వారు పరిశుద్ధాత్మచే శక్తి పొందినవారై ఈ కార్యాలు జరిగించారు (1 కొరింథీ. 12:11). వారు పొందిన అద్భుత శక్తులు వారిపై అపొస్తలులు చేతులుంచుటవలనను పరిశుద్ధాత్మ యివ్వబడడంవలనను వచ్చాయి (అపో. 8:14-17; 19:6). ఈ హేతువుచేత, అపొస్తలులున్నప్పుడు మాత్రమే ఈ అద్భుత వరాలు యివ్వబడ్డాయి (రోమా 1:11 గమనించు). సువార్త సత్యాలను స్థిరపరచే ఉద్దేశంతో యివి ఉద్దేశింపబడ్డాయి (మార్కు 16:20; అపో. 14:3; హెబ్రీ. 2:3, 4) అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద సంఘం స్థాపింపబడింది (ఎఫెసీ. 2:20).

మార్కు 16:17, 18ని గూర్చి J. W. McGarvey సరిగా తెలిపాడు:

> ఈ సూచక క్రియలు నిర్ణీతమైన ఏ సమయంవరకు వెంటాడతాయనిగాని, విశ్వాసియైన ప్రతివ్యక్తివలన జరుగుతాయనిగాని కాదు; అయితే అవి కేవలం వెంటవస్తాయి, విశ్వాసులను ఒక bodyగా తీసికొంటే వారిని వెంటాడతాయి. అపొస్తలుల కాలంలోని విశ్వాసులను అవి వెంటాడాయి - ప్రతి వ్యక్తిగతమైన విశ్వాసినో, అందరినో, లేక దాదాపుగా అందరినో కాదు. ఏది వాగ్దానం చేయబడిందో, దానికి యిది సంపూర్ణ నెరవేర్పైయుంది.[3]

## అద్భుతాలు యేసు నామమున చేయబడ్డాయి

ప్రభువైన యేసు సిలువవేయబడక ముందు రాత్రి, ఆయన తన అపొస్తలులకు యిలా తెలిపారు: "నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును" (యోహాను 14:14). యేసు నామమున మనం అడిగితే అద్భుతం జరుగుతుందని కొందరు దీన్నిబట్టి తీర్మానించారు. ఏదియెలాగున్నా, ఈ ప్రతిపాదన చేసినప్పుడు ఆయన యొద్దనున్న అపొస్తలులకు మాత్రమే యిది చెప్పబడింది (మత్తయి 26:20; లూకా 22:14). యేసు నామమున దయ్యాన్ని బయటికి రమ్మని ఉచ్చరించిన మనుష్యులను గూర్చి అపొస్తలుల కార్యగ్రంథము తెలుపుతుంది. అందుకు ఆ దయ్యము, "నేను యేసును గుర్తెరుగుదును, పౌలును కూడ ఎరుగుదును, గాని మీరెవరని" అడిగింది (అపో. 19:13-15). క్రీస్తు పౌలుకు అధికారమనుగ్రహించాడు కాని స్కెవయను వాని కుమారులకు కాదు. అధికారం లేనివారు తనను ఆజ్ఞాపించితే దయ్యమువారికి లోబడలేదు.

"ప్రభువా, ప్రభువా, మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములు వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా?" అని అడిగిన

అక్రమస్థులను తాను ఎన్నడే ఎరుగనట్టు ప్రభువు తెలిపారు (మత్తయి 7:22).

తొలిగా అద్భుతాలు చేయు శక్తి యివ్వబడాలి; తరువాత అద్భుతం ద్వారా యేసు నామమున అడుగుటవలన యివ్వబడుతుంది. దీనికి ఉదాహరణ అపో. 3:1-16లో కన్పిస్తుంది. ఆత్మ వచ్చినప్పుడు శక్తిపొందిన పేతురు యోహానులు (అపో. 1:8; 2:4), ఒక కుంటివానిని, యేసు నామమునను (6 వ.) ఆయన నామమందలి తమ విశ్వాసముద్వారాను, (16 వ.) స్వస్థపరచారు. కేవలం విశ్వాసమువలననే గాని లేక కేవలం యేసునామమున అడగడంవలననే గాని అద్భుతాలు జరుగలేదు. శక్తి యివ్వబడాలి, అప్పుడు అద్భుతము యేసు నామమందలి విశ్వాసంవలన జరిగింపబడాలి.

## డబ్బుకొరకు అద్భుతాలు చేయబడలేదు

కుంటి భిక్షకునితో పేతురు యిలా తెలిపాడు: “వెండి బంగారములు నాయొద్దలేవు” (అపో. 3:6ఎ). గతంలో ప్రభువైన యేసు తన అపొస్తలులకు యిలా ఆజ్ఞాపించారు, “రోగులను స్వస్థపరచుడి, చనిపోయినవారిని లేపుడి, కుష్ఠ రోగులను శుద్ధులనుగా చేయుడి, దయ్యములను వెళ్లగొట్టుడి. ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి” (మత్తయి 10:8). “... తరచుగా జాగరణములతోను, ఆకలిదప్పులతోను, తరచుగా ఉపవాసములతోను, చలితోను, దిగంబరత్వముతోను ఉంటిని” అని పౌలు రాశాడు (2 కొరింథీ. 11:27). “-నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలము లేదని” ప్రభువైన యేసు అన్నారు (లూకా 9:58).

అద్భుత శక్తులుగలవారు ధనసంపాదన కొరకు వాటిని వినియోగించలేదు. ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడని ప్రభువు తెలిపారు. నేడైతే అద్భుతాలు చేస్తామని చెప్పేవారు ఎంతో ఎక్కువైన డబ్బును గుంజుతారు, తమకు డబ్బుయిచ్చే జనుల (పేదలు) కంటె ఎంతో ఎక్కువైన భోగేచ్ఛలలో తులతూగుతారు, ఇందులో వారు ప్రభువు మాదిరిని, పౌలు, పేతురు, ఇంకను అనేకమంది ఆది క్రైస్తవుల మాదిరిని అనుసరించినవారు కారు. వీరు చేస్తున్నట్టు చెప్పుకొంటున్న అద్భుతాలను బట్టి ఆర్థికంగా మంచి స్థితిలోనే ఉండసాగారు.

## అద్భుతాలు అందరిని “బాగుచేసేవి” కావు

ప్రభవైన యేసు వైద్యులయందు నమ్మికయుంచారు, అంటే ఔషధాన్ని ఉపయోగించుటను ఆయన అంగీకరించినట్టు గుప్తం చేయబడింది. “రోగులకేగాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కరలేదు గదా” అని ఆయన తెలిపారు (మత్తయి 9:12; మార్కు 2:17; లూకా 5:31). లూకా వృత్తినిబట్టి వైద్యుడు. పౌలు అతని గూర్చి తెలిపినప్పుడు, అతడు వైద్యుడైయున్నట్టు సూచింపక, “లూకా అను ప్రియుడైన వైద్యుడును” అని సూచించాడు (కొలస్సీ. 4:14). అలా అనడంలో, అతడు క్రైస్తవుడైన తరువాత కూడ వైద్యుడుగా కొనసాగినట్టు అది తెలుపుతుంది.

తిమోతికి అతడు రాసినప్పుడు ఔషధ ఉపయోగాన్ని అపొస్తలుడైన పౌలు ప్రోత్సహించాడు: తిమోతీ – “ఇక మీదట నీళ్లే త్రాగక నీ కడుపు జబ్బు నిమిత్తమును తరచుగావచ్చు బలహీనతలకోసరమును ద్రాక్షారసము కొంచెముగా పుచ్చుకొనుము” (1 తిమోతి. 5:23). ద్రాక్షారసాన్ని పానీయంగా త్రాగమని పౌలు తిమోతికి చెప్పలేదు కాని ఔషధంగా మాత్రమే వాడ కోరమన్నాడు. తిమోతి కడువు జబ్బుకును తరచుగా వచ్చు బలహీనతల నిమిత్తమును యిది నియమింపబడింది.

పౌలు తన జతపనివారిని బాగుచేయలేదనేది వాస్తవం. స్వస్థత అనేది కేవలం రోగులను స్వస్థపరచడం మాత్రమే గాక, దానికి వేరొక ఉద్దేశమున్నట్టు తెలుస్తుంది. “త్రోఫిము రోగియైనందున అతని మిలేతులో విడిచివచ్చితిని” అని పౌలు రాశాడు (2 తిమోతి 4:20బి). తన “శరీరములో ముల్లు” విషయమై పౌలు బాగుచేయబడలేదు (2 కొరింథీ. 12:7, 8).

పైన పేర్కొనబడిన ప్రతిపాదననుండి ఈ క్రింది విషయాలు గుర్తింపవచ్చు: (1) రోగులు వైద్యులను ఉపయోగించుకోవాలి. (2) పౌలు అపొస్తలుడుగా శక్తిపొందినవాడై జనులను బాగు చేసినను (అపో. 14:9, 10; 19:11, 12), అతడు తిమోతిని గాని, త్రోఫిమును గాని స్వస్థపరచలేదు. (3) రోగములను నేడు బాగుచేసికొనుటకు సహాయ పడునట్లు ఔషధమును వాడుకొనుమని తిమోతి హెచ్చరింపబడ్డాడు. (4) తిమోతిని, త్రోఫిమును బాగుచేయడానికి పౌలు విశ్వాసం బలీయంగా లేదా లేక బాగుపడునట్టుగా వారి విశ్వాసం బలీయంగా లేదా అనడానికి బదులు అద్భుత స్వస్థతలు విశ్వాసులకు ఉద్దేశింపబడలేదనే వాస్తవాన్ని గుర్తించాలి. అటు పౌలు యొక్క విశ్వాసాన్ని గాని తిమోతి (2 తిమోతి 1:5) త్రోఫిము విశ్వాసాన్ని గాని మనం ప్రశ్నింప పని లేదు. (5) తన్ను బాగుచేయడానికి విశ్వాసము, ప్రార్థన అనేవాటిని సిఫారసు చేయడానికి బదులు, ఔషధాన్ని వాడమని పౌలు అతనికి హితవు పలికాడు. కేవలం విశ్వాసమే స్వస్థపరచగలిగేదైతే, అప్పుడు పౌలు తిమోతికి తప్పు సలహాయిచ్చాడన్నమాటే. (6) పౌలు – తిమోతిని త్రోఫిమును స్వస్థపరచగలవాడై, అతడు వారికి అది చేయనట్టయితే, వారికి గొప్ప అన్యాయం చేసినవాడైయుండేవాడే.

(7) అవిశ్వాసులను ఆకర్షించడానికి గాని లేదా అందింపబడుతున్న సందేశం దేవునినుండి వచ్చిందని స్థిరపరచడానికిగాని పరిస్థితులు ఏర్పడినప్పుడే స్వస్థతలు జరిగినట్టున్నాయి. (8) పౌలు సందేశం దేవునినుండి వచ్చిందన్న వాస్తవం తిమోతి త్రోఫిములు ఎరుగుదురు గనుక ఆ పక్షంగా వారికి రుజువు అవసరముండదు. (9) మనకు అవసరమైన రుజువును రాయబడిన వాక్యము యిస్తుంది (యోహాను 20:30, 31) అందునుబట్టి దేవుడు మనకు మరొక రుజువును యివ్వనవసరం లేదు. ఉదాహరణకు, లూకా 16:29–31లోని ధనవంతునికి మోషేయు ప్రవక్తలను మించిన సాక్ష్యం అవసరం లేదు. (10) మనం రోగులమైయున్నప్పుడు స్వస్థత పొందడానికి మనకు అందుబాటులోనున్న ప్రతి సదుపాయాన్ని వినియోగించుకోవాలి. సహాయం కొరకు మనం ప్రార్థించవచ్చుగాని, అద్భుతాలకొరకు కాదు.

## ముగింపు

దేవుడు దేవుడైయున్నాడనియు, ఆయన తన్నుతాను తన వాక్యము ద్వారా బయలు పరచుకొని యున్నాడనియు రుజువు చేయడంలో సూచక క్రియలు మహత్కార్యములు జరిగించిన పరిశుద్ధాత్మ కార్యము ప్రాముఖ్యమైయున్నది. అద్భుతరీతిగా తమ ద్వారా నేరుగా పనిచేయడానికి నేడు పరిశుద్ధాత్మకు అవసరం లేదు. అపొస్తలులు చేతులుంచి ప్రార్థించినప్పుడు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ వరములు పొందినవారిలో కడపటివాని మరణంతో ఆ పని ఆగిపోయింది.

ఉపదేశకులు తన ఉపదేశాన్ని బట్టియే తీర్పుపొందాలి తప్ప, చెప్పుకొంటున్న అద్భుత వరాలనుబట్టి కాదు. మనము ఆత్మలను (ఉపదేశాలను) పరీక్షించువారమైయుండాలి (1 యోహాను 4:1). వారు చేస్తున్నట్టు చెప్పుకొంటున్న సూచకక్రియలనుబట్టి కాకా వారి ఉపదేశాన్నిబట్టి యిది జరగాలి. "వారు లోకసంబంధులు గనుక లోకసంబంధులైనట్టు మాటలాడుదురు, లోకము వారి మాట వినును. మనము దేవుని సంబంధులము; దేవుని ఎరిగినవాడు మన మాట వినును, దేవుని సంబంధి కానివాడు మన మాట వినడు. ఇందువలన మనము సత్య స్వరూపమైన ఆత్మ యేదో, భ్రమపరచు ఆత్మ యేదో తెలిసికొను చున్నాము" (1 యోహాను 4:5, 6).

---

సూచనలు

[1]J. W. McGarvey, *New Commentary on Acts of Apostles*, vol. 1 (N.p., 1892; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 142. [2]కొర్నేలియు అతని యింటివారికి సంబంధించిన చర్చను చూడు. [3]J .W. McGarvey, *Matthew and Mark,* The New Testament Commentary, vol. 1 (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 375.